



19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 3 మార్చి 2026




పర్యావరణ పరిరక్షణకు

## నడుం బిగించాలి

రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం నగరంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అమృత కృష్ణ పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛమైన నీటి బాటలింగ్ యూనిట్ ను రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాను రాను పర్యావరణం కలుషితం అవుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిన్నతనంలో బోరింగులు ఎక్కడపడితే అక్కడ నీరు తాగే వారమన్నారు. నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. **మిగతా 2లో...**




# అడ్డగోలుగా అక్రమ మైనింగ్

- ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వకాలు
- అధికార పార్టీ, అధికారులు అండదండలు మెండుగా ఉన్నాయంటూ ఆరోపణలు
- అధికలోడు వలన ధ్వంసం అవుతున్న రహదారులు డొంకరోడ్లు కల్వట్లు

(వత్సవాయి, మార్చి 2, మేజర్ న్యూస్)

వివరాలు 2లో



ప్రతి అర్జీపైనా....

## దృష్టిసారించాలి

గడువులోపు సమస్యకు పరిష్కారం చూపాలి

ఎన్టీఆర్ జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 174 అర్జీలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2లో...

# విద్యుత్ దీపాలు పనిచేయకపోతే కఠిన చర్యలు



జాతీయ రహదారులపై

పలుచోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం

కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన అజెండా అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. 2

(మొదటిపేజీ తరువాయి)



## విద్యుత్ దీపాలు పనిచేయకపోతే కఠిన చర్యలు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై పలు చోట్ల విద్యుత్ దీపాలు పనిచేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో జాతీయ రహదారుల అధికారులు, ఆయా కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిధులున్నా నిర్వహణ సరిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ, అవసరమైన చోట్ల తక్షణం మరమ్మతులు చేపట్టి నిరంతరాయంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. ఈ సమస్యపై దృష్టి పెట్టకపోతే సంబంధిత అధికారులపై చర్యల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాస్తామని అన్నారు. రహదారి ప్రమాదాలను అరికట్టటం ప్రతి ఒక్క అధికారి బాధ్యత అని, ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారులకు చేరుకునే అప్రోచ్ రహదారులకు అత్యవసరంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారులపై విద్యుత్ దీపాలు వెలగని ప్రాంతాలలో రహదారి ప్రమాదం జరిగితే జాతీయ రహదారుల అధికారులు, కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ, గత సమావేశంలో పనిచేయని విద్యుత్ దీపాల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్కు షోకాస్ నోటీసు జారీ చేయాలని ఎస్పీ తమ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎస్ఓ కె ధర్మేంద్ర, జిల్లా రవాణా అధికారి ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాస్, భారత జాతీయ రహదారుల అధికార సంస్థ పిడి విద్యాసాగర్, జిల్లా ప్రజారవాణా అధికారి వెంకటేశ్వర్లు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేశ్వరరావు, ఇంచార్జ్ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, రాష్ట్ర రహదారులు, పోలీసు, రెవిన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలి



**ఎన్‌టీఆర్ జిల్లా, మార్చి 02, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా సమస్యకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.జ్యోతి, ఏసీపీ వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోసిబాబుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 174 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 66 అర్జీలు రాగా పురపాలక, పట్టణాభివృద్ధికి సంబంధించి 26, పోలీస్ 18, పంచాయతీరాజ్ 15, మార్కెటింగ్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగానికి అయిదు అర్జీలు వచ్చాయి. విద్యుత్, పౌర సరఫరాలు, విభిన్న ప్రతిభావంతులు, ఆరోగ్య శాఖలకు నాలుగు చొప్పున అర్జీలు అందాయి. ఇరిగేషన్‌కు 3 అర్జీలు రాగా ఏపీఎస్ఆర్టీసీ, ఎక్సైజ్, విద్య, గృహ నిర్మాణం, మైన్స్, నైపుణ్య అభివృద్ధి, ఎండోమెంట్ కి రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. పశు సంవర్ధక, ఆయుష్, బ్యాంకింగ్ సేవలు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, కార్మిక శాఖకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి పీజీఆర్ఎస్ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న విశ్వసనీయ వేదిక అని, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్జీల పరిష్కారంలో జాప్యం చేయకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలనలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యతాయుత విధానం పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి



(మొదటిపేజీ తరువాయి)

స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహార అందేలా చూసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తమన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయిందని హోటల్లో పార్సల్లు అన్నీ కూడా క్యారీ బ్యాగుల్లోనే సరఫరా అవుతున్నాయన్నారు. ప్లాస్టిక్ మట్టిలో కలవాలంటే కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేక ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం కలెక్టరేట్లో స్వచ్ఛమైన నీటి బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం ఒక మంచి ఆలోచన అని అందుకు చొరవ తీసుకున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని ధైర్యం చేసి బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకున్న మహిళ జీవామృతను మంత్రి అభినందించారు.

ప్రభుత్వపరంగా ఆమెకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వానికి మహిళ లపై పూర్తి నమ్మకం ఉందని, వారు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లిస్తారన్నారు. ఆమె బాటిలింగ్ యూనిట్ తప్పకుండా విజయవంతం అవుతుందన్నారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ఎక్కువైందని ప్లాస్టిక్ ఎక్కడ పడితే అక్కడ పారవేయడం ముఖ్యంగా మురికి కాలువల్లో వేయడం వలన అక్కడ ఇరుక్కుపోయి మురుగునీరు ప్రవహించక దోమలు వృద్ధి చెందుతున్నా యన్నారు. దోమల వలన మానవులకు ఆరోగ్య సమ స్యలు వస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ ముక్కలు ముక్కలుగా అయ్యి ఆహారంలో కలిసి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోం దన్నారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వాడకం నిలిపివే యాలని మనం ఎక్కువగా క్యారీ బ్యాగులు వాటర్ బాటిల్స్‌ను వినియోగిస్తున్నామని వాటి వాడకం తగ్గించాల న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త అనే నినాదంతో ముందుకు వెళుతుందన్నారు. ఇందులో భాగంగానే ఒక పేద మహిళలకు పీఎంఈజీపి పథకం కింద 15 లక్షల రూపాయలు రుణం మంజూరు చేయిం చి, ఈ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేయించామ న్నారు. ఆ మహిళలకు స్వయం ఉపాధి లభించడంతో పాటు పర్యావరణానికి హితంగా కూడా మార్పు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన పెద్దలు ప్రతి ఒక్కరు కూడా వారికి సంబంధించి ఏదైనా కార్యక్రమాలు ఉంటే ఈ బాటిలింగ్ యూనిట్ నుండి మంచినీటిని కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం తరపున ఏ కార్యక్రమం జరిగిన ఇదే నీటి బాటిల్ యూనిట్ నుండి నీటి సీసాలను వాడాలని నిర్ణయించుకున్నామన్నారు.

ఆర్కే హోటల్లో కూడా ఈ బాటిల్ యూనిట్ నుండి నీటి సీసాలను తీసుకొని పేద మహిళలకు అండగా నిలవాలన్నారు. సీసాలు వాడాక సీసాలను తిరిగి ఇస్తే నీటి దర 6 రూపాయిలు మాత్రం వసూలు చేయడం జరుగుతుందన్నారు. కాషన్ డిపాజిట్‌గా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని నీటి ధర తగ్గించుకొని మిగిలిన డబ్బులు వారు చెల్లిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ చంద్రశేఖర రావు, డి ఆర్ డి ఎ పిడి హరిహరనాద్, మచిలీపట్నం ఆర్డిఓ సాంబశివరావు, కె వి ఐ బి ఏ డి శ్రావణ్ కుమార్, డీసీఎంఎస్ అధ్యక్షులు బండి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు దిలీప్ కుమార్, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

## పన్ను చెల్లింపులకు ఆదివారం క్యాష్ కౌంటర్లు అందుబాటులో..



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పన్ను చెల్లింపులకు ఆదివారం కూడా క్యాష్ కౌంటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ స్థలము పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్ను, వాటర్ మీటర్ పన్నులు చెల్లింపు కాలపరిమితి ది.31-03-2026తో ముగియుచున్నందున, బకాయిలు ఉన్న పన్నులను వెంటనే చెల్లించవలసినదిగా ప్రజలను కోరారు. ప్రజల సౌకర్యార్థము నగరపాలక సంస్థ సర్కిల్స్-1, 2, 3వద్ద క్యాష్ కౌంటర్లు, విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయము వద్ద పుర సేవ కేంద్రంలో గలక్యాష్ కౌంటరు ది.03-03-2026 (మంగళవారము) నుండి ది.31-03-2026 (మంగళవారము) వరకు అన్ని దినములలో, శెలవు దినములతో సహా ఉదయం 9:00నుంచి సాయంత్రం06:00గంటల వరకు పనిచేయునని అన్నారు. కావున పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకొని పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించవలసినదిగా కొరకు.

# అడ్డగోలుగా అక్రమ మైనింగ్ తవ్వకాలు

### ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వకాలు

### అధికార పార్టీ, అధికారులు అండదండలు మెండుగా ఉన్నాయంటూ ఆరోపణలు

### అధికలోడు వలన ధ్వంసం అవుతున్న రహదారులు డొంకరోడ్లు కల్వట్లు



**వత్సవాయి, మార్చి 2, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేయదంతో ఇసుక కన్నా మైనింగ్ ( గ్రావెల్) కు మంచి డిమాండ్ ఉంది .ఈ ప్రాంతం ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలకు సమీపంలో ఉండటం వలన గ్రావెల్ అక్రమ రవాణాకు అనుకూలంగా ఉంది. కొంత మంది అధికార పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని యదేచ్ఛగా గ్రావెల్ అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తూ కోట్లు గడిస్తున్నట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమ మైనింగ్ తవ్వకాలు యదేచ్ఛగా నిర్వహిస్తున్న అధికారులు చూచి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేచుపాలెం రెవెన్యూ పరిధిలో పట్టా భూమిలో ఉన్న కొండను తవ్వి అధికార పార్టీకి చెందిన కొంతమంది అనధికార అనుమతులు పొంది కోట్లు గడిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ ప్రాంతంలో జరుగుతున్న మైనింగ్ (గ్రావెల్) అధిక లోడుతో ట్రిప్పర్ల ద్వారా రవాణా చేయడం వలన పంట పొలాలకు వెళ్లే రహదారులు డొంక రోడ్లు అలాగే సాగునీటి కాలువలపై ఉన్న కల్వట్లు సైతం ధ్వంసం కావడంతో పొలాలకు వెళ్లే రైతులకు అనేక ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అధికార పార్టీని అడ్డుపెట్టుకొని అరకొర అనుమతులతో అక్రమంగా మైనింగ్ తవ్వకాలు జరిపి అక్రమార్జనకు పాల్పడుతున్న వైనం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ విధంగా అధిక లోడుతో అక్రమ రవాణా వలన ప్రజా ధనం దోపిడికి లోనవుతుందని పలువురు ఆవేదన వ్యక్తపరు స్తున్నారు దీని వలన ప్రభుత్వ ఆదాయానికి గండు పడుతుంది. అలాగే సహజ వనరులు అంతరించి పోతున్నాయి కనుక ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అక్రమ రవాణాతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి పెడుతున్న అక్రమార్కులపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అధికారులను కాంట్రాక్టర్లను వివరణ కోరగా పొంతనలేని సమాధానం చెప్పడం జరిగింది.



# ఫిబ్రవరి 2026లో ఆంధ్రప్రదేశ్ నికర జీఎస్టీ వసూళ్లలో 5.45% వృద్ధిని నమోదు చేసింది

## ఫిబ్రవరిలో ఇప్పటివరకు ఎన్నడూ లేనంత అత్యధికంగా నికర జీఎస్టీ వసూళ్లు సాధించబడ్డాయి

**విజయవాడ, మార్చి 2, మేజర్ న్యూస్ :** సెప్టెంబర్ 22, 2025 నుండి అమలులోకి వచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల అమలు కారణంగా ప్రధాన వినియోగదారుల నిత్యావసరాలు, వినియోగ వస్తువులు, ఔషధాలు, సిమెంట్‌పై రేటు తగ్గింపుతో పాటు జీవిత బీమా, వైద్య బీమాపై జీఎస్టీ ఉపసంహరణ ఉన్నప్పటికీ, ఫిబ్రవరి 2026లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నికర జీఎస్టీ వసూళ్లలో వృద్ధిని నమోదు చేసింది. పొగాకు, పొగాకు ఉత్పత్తులు మినహా అన్ని బాధ్యతాయుతమైన వస్తువులపై జీఎస్టీ పరిహార సెస్ ఉపసంహరించబడింది. ఫిబ్రవరి 2026లో సేకరించిన ఆదాయం జనవరి 2026లో నిర్వహించిన వ్యాపార లావాదేవీలకు సంబంధించినది. రేటు తగ్గింపులు, వ్యూహాత్మక విధాన చొరవలు, మెరుగైన సమ్మతి విధానాల ద్వారా పెరిగిన వినియోగం రాష్ట్రం యొక్క స్థిరమైన ఆదాయ వృద్ధికి దోహదపడింది, 2017లో జీఎస్టీ పాలన అమలు చేసిన తర్వాత ఫిబ్రవరి 2026ని ఫిబ్రవరిలో అత్యధిక నికర వసూళ్లుగా మార్చింది.

**ఫిబ్రవరి -2026లో జీఎస్టీ ఆదాయ పనితీరు:**

– ఫిబ్రవరి 2026కి నికర జీఎస్టీ వసూళ్లు రూ.3,061 కోట్లకు చేరుకున్నాయి. అనేక వస్తువులపై పన్ను రేట్లు తగ్గినప్పటికీ ఫిబ్రవరిలో ఇది ఇప్పటివరకు అత్యధికం.

– వరుసగా పదకొండు నెలలు (ఏప్రిల్–ఫిబ్రవరి 2026), నికర జీఎస్టీ వసూళ్లు గత ఆర్థిక సంవత్సరంలో అదే నెలలను అధిగమించాయి, ఇది రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు, వినియోగంలో స్థిరమైన, స్థిరమైన వృద్ధిని సూచిస్తుంది.

– ఫిబ్రవరి 2025 తో పోలిస్తే, నికర జీఎస్టీ వసూళ్లు 5.45% పెరిగాయి, అనేక వస్తువులపై పన్ను రేట్లు తగ్గినప్పటికీ ఘన పనితీరును ప్రదర్శిస్తున్నాయి. 2025–26 సంవత్సరానికి సంచితంగా (నెలవారీగా), ఏపీ (5.86%) కర్ణాటక (5.70%), తమిళనాడు (3.10%), తెలంగాణ (4.57%), కేరళ (2.95%),, ఒడిశా (–8.18%) వంటి ఇతర దక్షిణాది రాష్ట్రాల కంటే మెరుగైన స్థానంలో ఉంది.

– అనేక ఉత్పత్తులపై పన్ను రేటు తగ్గింపులు, పాప వస్తువులపై సెస్ తొలగింపు ఉన్నప్పటికీ ఫిబ్రవరి 2026లో సిఆఇఎస్ఎస్ లేకుండా స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.3,562 కోట్లుగా ఉన్నాయి. పన్ను రేట్లు తగ్గించడం, పీప వస్తువులు మినహా అన్ని ఉత్పత్తులపై పరిహార సెస్ ఉపసంహరణ ఉన్నప్పటికీ ఫిబ్రవరి 2026లో స్థూల జీఎస్టీ వసూళ్లు ఫిబ్రవరి 2025 తో పోలిస్తే కొద్దిగా తగ్గాయి. (సెస్సు లేకుండా వసూళ్లు 0.22% తగ్గుదల మాత్రమే) ఒక ముఖ్యమైన సానుకూల అంశం ఏమిటంటే, వసూళ్లలో ప్రారంభ స్థానం తక్కువగా ఉన్నప్పటికీ, అస్థిరత కంటే స్థిరమైన, స్థిరమైన పురోగతిని ప్రదర్శించినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ఈ వృద్ధిని సాధించింది. 9.67% పదునైన క్షీణతను అనుభవించిన ఒడిశా మాదిరిగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ సానుకూల వృద్ధిని కొనసాగించింది, ఆదాయ సమీకరణలో మెరుగైన సమ్మతి, స్థితిస్థాపకతను సూచిస్తుంది. మొత్తం మీద, ఆంధ్రప్ర దేశ్ స్థిరమైన, సగటు కంటే ఎక్కువ వృద్ధిని, చాలా పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన ఆదాయ పనితీరును, ప్రభావవంతమైన పన్ను పరిపాలనను ప్రదర్శి స్తుంది, దీనిని ప్రాంతీయంగా, జాతీయ స్థాయిలో అనుకూలమైన స్థితిలో ఉంచుతుంది.




## మాన్యవర్ మోహే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'తో విరోష్ ఫినామినా

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అత్యుత్తమ వివాహ ఫ్యాషన్ బ్రాండ్ మాన్యవర్ మోహే.. రష్మిక మందన, విజయ్ దేవరకొండలను తన నూతన వాణిజ్య ప్రచార చిత్రం 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'కు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకుంది. ఈ జంట ఎవరూ కాదనలేని కెమిస్ట్రీతో గతంలో ఎన్నడూ చూడని కలెక్షన్‌తో, వారి అంతిమ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' క్షణానికి దారితీస్తుంది. ఒక స్టైలిష్, సింక్రొనైజ్ ప్రణాళికగా ప్రారంభమయ్యేది తక్షణమే ఒక చరిత్రగా, లిరికల్ షోడౌన్‌గా మారుతుంది. 'ఇద్దరం ఒకే రకమైన దుస్తులు వేసుకుందాం అనుకున్నాం కదా, కానీ, ఇవేం దుస్తు లు ధరించావు' అనే మొదటి చమత్కారమైన షాట్‌ను రష్మిక పేల్చడంతో ఉల్లాసభరితంగా ప్రారంభమవుతుంది. ఆమె మాటలకు విజయ్ స్పందిస్తూ, 'నీ హీరో ఇంప్రెస్ చేస్తున్నాడు, అవును కదా?' అంటూ అంతే మనోహరమైన సమాధానాన్ని ఇస్తాడు. ఈ హాస్యం సరదాగా మరో స్థాయికి చేరుకుంటుంది. 'అయితే క్యాన్సిల్ చేద్దాం! మనం మేడ్ ఫర్ ఈచ్ అదర్ కాదు కదా' అనే నాటకీయ ప్రకటనతో ముగుస్తుంది. ప్రేక్షకులు 'వారు చేస్తారా లేదా చేయరా' అనే సరదా, రొమాంటిక్–కామ్ శైలి ఉద్రిక్తతను కొనసాగిస్తున్న సమయంలో సంగీతం మృదువుగా మారుతుంది.. కథ కూడా రంజుగా మారుతుంది. ఈ క్యాంపెయిన్ ఉత్కంఠభరితమైన దృశ్యకావ్యంతో ముగుస్తుంది. విజయ్ మాన్యవర్ ఇండో వెస్ట్రన్ శైలి దుస్తుల్లో అద్భుతంగా సిద్ధం కాగా, రష్మిక మోహే లెహంగాలో మెరిసిపోయారు. కొత్త టీవీసీ టెలివిజన్, డిజిటల్, ప్రింట్, సినిమా, అవుట్‌డోర్, సోషల్ మీడియా, వ్యూహాత్మక పీఆర్‌లలో విస్తరించి ఉన్న బలమైన 360 డిగ్రీల ప్రచారం ద్వారా విస్తరించనుంది.

# అంగరంగ వైభవంగా రామలింగేశ్వరుని కళ్యాణ వేడుకలు



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామివారికళ్యాణోత్సవవేడుకలు ఆదివారం అర్ధరాత్రి (సోమవారం వేకువ జామున) నిర్వహించిన వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. శాశ్వత ఉభయ దాతలు ఏలేశ్వరపు వెంకట రమణమూర్తి–శైలజ దంపతులు వారి కుమార్తె అల్లుడు లక్ష్మీ జ్యోతి శ్రావణి– సాయి సాకేత్ దంపతులు ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. వివాహ వేడుకలు తిలకించేం దుకు కూచిపూడి, పెదపూడి, మొవ్వ, యద్దనపూడి, పెడసనగల్లు గ్రామాల నుంచేకాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు. సాంప్రదాయ పద్ధతిలో పండితుల వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలు హోరులో అత్యంత వైభవంగా నాలుగు గంటల పాటు జరిగిన ఈ కళ్యాణ అనంతరం స్వామి వారు నంది వాహనంపై గ్రామంలో ఊరేగారు.

## విశేష అలంకరణలో నాంచారమ్మ దర్శనం



**కోడూరు మేజర్ న్యూస్ :** విశ్వనాథపల్లి కృష్ణా నది తీరాన కొలువున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ జాతర నేపధ్యంలో సోమవారం అమ్మవారు విశేషాలంకారణలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల పార్థసారథి ప్రత్యేక పుష్ప పూజలు నిర్వహించారు జాతర మహోత్సవానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయం ఈవో వివి మోహన్ రావు ఆలయ చైర్మన్ తోట సూర్య వెంకట నరసింహారావు తెలిపారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్




**జగ్గయ్యపేట, మార్చి 02, మేజర్ న్యూస్:** మండలంలోని 31 మందికి 10,10,281 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు స్వయంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అందజేశారు.వివిధ గ్రామాలకు చెందిన 31 మంది వివిధ అనారోగ్యాల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకుని భారీగా మెడికల్ ఖర్చులు అయ్యాయి. అనంతరం ఆ మెడికల్ బిల్లులను స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తులు పంపించగా, సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన ₹10,10,281 విలువైన చెక్కులను సోమవారం పట్టణంలోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించుకోలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో తోడ్పాటు అందిస్తున్నదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు వివిధ హోదాలలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాలు వేస్తున్న ఐదుగురు అరెస్ట్



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొండిపర్రు గ్రామంలో కోడి పందాలు వేస్తుండగా దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపు లోనికి తీసుకు న్నట్లు పామర్రు ఎస్సై – 2 జి.విజయభాస్కర్ తెలిపారు. కోడిపందాలు వేస్తు న్నారనే సమాచారం మేరకు దాడి నిర్వహించి ఐదుగురిని అదుపులోనికి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుండి రెండు కోడి పుంజులు, 6,350 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామని ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.

# విద్యాశాఖ మంత్రిని మార్చండి

## సీఎంకి జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రాధాన్యత కలిగిన అతి పెద్ద శాఖ అయినా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ శాఖకు పూర్తి న్యాయం చేయలేకపోతున్నారని వారిని విద్యా శాఖ నుండి వేరొక శాఖకు మార్చాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి మధుసూదన రాజు, కన్వీనర్ కోన దేవదాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్యమంత్రి తరువాత ఆ స్థాయి బాధ్యతలు నిర్వహిస్తూ జాతీయంగా, అంతర్జాతీయంగా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న నారా లోకేష్ పూర్తిస్థాయిలో విద్యా శాఖపై దృష్టిపెట్టకపోవడం వలన యావత్ సిబ్బంది చెప్పుకోలేని ఆవేదనకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. విద్యా శాఖలో భాగమైన జిల్లా గ్రంథాలయ సంస్థలకు బడ్జెట్ కోత విధించి ప్రతి నెలజీతాలు పెన్షనర్లకు ఎదురుచూపులు అయినవి. రాజధాని ప్రాంతమైన కృష్ణా జిల్లాలో మూడు నెలలనుండి పెన్షన్లు జీతాలు లేవు దాదాపు రాష్ట్రమంతా ఇదే పరిస్థితి పూర్తిగా గ్రంథాలయ చెస్సు మీద ఆధారపడి జీతాలు పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పౌర గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారులకే లోకేష్ని కలిసి చెప్పుకునే అవకాశం లేదు ఇక ఉద్యోగులు పరిస్థితి ఆలోచించాలని తెలియజేశారు. దీనికి తోడు ఉద్యోగులు ప్రతివారం జయంతులు, వర్ధంతిలు వాటికి ఖర్చు. గతంలో చేసిన సమ్మర్ క్యాంపులు, వారోత్సవాలు మొదలైన కార్యక్రమాలకు ఉద్యోగులు సొంతగా ఖర్చు చేసిన డబ్బులు కూడా బిల్లులు ఇంతవరకు శాంక్షన్ చేయటం లేదని, గ్రామీణ గ్రంథాలయ సిబ్బందికి, పుస్తక పంపిణీ కేంద్రాలసిబ్బందికి వారికి ఇచ్చే అరకొర జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తక్షణమే జోక్యం చేసుకొని లోకేష్ స్థానంలో పూర్తిస్థాయిలో దృష్టి సారించగల మరొకరిని విద్యాశాఖ మంత్రిగా నియమించి అతి పెద్దదైన ప్రాధాన్యత కలిగిన విద్యాశాఖకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పెదప్రోలులో పాత విద్యుత్ స్థంభాలు తొలగించండి



**మోపిదేవి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పెదప్రోలులో పాత ఇనుప విద్యుత్ స్థంభాలు ఎక్కడివి అక్కడే వంచి వదిలే శారు. ప్రధాన రహదారి పక్కన నూతన సిమెంట్ స్థంభాలు వేయించిన విద్యుత్ శాఖ అధికారులు పాత ఇనుప స్థంభాలు తొలగించలేదు. దీంతో రోడ్డు పక్కన ఇనుప స్థంభాలు ఎక్కడివి అక్కడే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత స్థంభాలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేద్దాం...

## మహిళా విభాగం ఛైర్‌పర్సన్ నిర్మలకుమారి, కన్వీనర్ పి.మాధవి

**విజయవాడ, మార్చి 2, మేజర్ న్యూస్ :** మహిళా ఉద్యోగులలో చైతన్యం నింపి... కొత్త ఉత్సాహంతో ముందుకు అడుగులు వేసేలా ఏపీ ఎన్‌జీజీవో మహిళా విభాగం నిరంతరం కృషిచేస్తోందని.. ఇందులో భాగంగా నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయడం ద్వారా మహిళలను సంఘటితను చాటిచెప్పాలని మహిళా విభాగం అధ్యక్ష, కన్వీనర్లు నిర్మలకుమారి, పి.మాధవిలు మహిళా ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ మహిళా ఉద్యోగుల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల కార్యక్రమాల గురించి వివరించేందుకు సోమవారం గాంధీనగర్‌లోని ఎన్‌జీవో హోమ్‌లో మహిళా విభాగం ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించారు.

సమావేశంలో రాష్ట్ర ఛైర్‌పర్సన్ నిర్మలకుమారి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చేందుకు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులకు ఆటలు, పాటలు, సాంస్కృతి కార్యక్రమాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 4వ తేదీన ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ బ్లాక్స్, షాట్ పుట్, అంత్యాక్షరి అంశాలపైనా, అయిదో తేదీన దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాట్మింటన్ సింగిల్, డబుల్స్ పోటీలు, ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో మినిట్ గేమ్, క్యారమ్స్, వ్యాసరచన పోటీలను, ఆరోతేదీన పాటలు, నృత్య పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.




ఈ నెల 9వ తేదీన ఎన్‌జీవో హోమ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళా ఐఏఎస్ అధికారులతో పాటు ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాలకు చెందిన మహిళా విభాగం ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ పి.మాధవి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం నింపేందుకు ఉత్సాహంతో సేవలందించడం ద్వారా వారు పనిచేస్తున్న కార్యాలయాల్లో మంచి గుర్తింపు పొందగలుగుతారన్నారు. మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ నాయకత్వంలో రాష్ట్ర కార్యవర్గం అవిరళ కృషిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల మహిళా ఉద్యోగులకు వయసుతో నిమిత్తం లేకుండా ఛైల్డ్ కేర్ లీవ్‌ను ఉపయోగించుకునేలా అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను తీసుకురావడం జరిగిందని. తద్వారా దాదాపు అయిదు లక్షల మంది మహిళా ఉద్యోగులు లబ్ధి పొందగలుగుతున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర నాయకత్వం సహకారంతో మహిళా విభాగం కృషిచేస్తోందన్నారు. మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయడం ద్వారా మహిళా ఉద్యోగుల ఐక్యతను మరోసారి చాటిచెప్పాలని మాధవి కోరారు. మీడియా ప్రతినిధుల సమావేశంలో ఏపీ ఎన్‌జీజీవో మహిళా విభాగం ప్రతినిధులు కె.శివలీల, వి.శాంతిశ్రీ, బి.జానకి, ఎం.సరస్వతి, బి.విజయశ్రీ, సీహెచ్ నాగమల్లేశ్వరి, ఎస్.దివ్య, వి.సురేఖ, పి.తులసీరత్నం తదితరులు పాల్గొన్నారు.



### జడ్పీహెచ్ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

**వత్సవాయి మేజర్ న్యూస్:** మండలంలోని మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళ సోమవారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న గ్రాండ్ టెస్ట్ ను, తొమ్మిదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ఎస్ఏ2 పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణ సాధించే విధంగా ఉపాధ్యాయులందరూ తగు చర్యలు తీసుకోవాలని కోరారు కొత్తగా పబ్లిక్ పరీక్షల సెంటర్ వచ్చినందున గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు పరిశీలించి, పరీక్ష సమయానికి సిద్ధంగా ఉంచాలని కోరారు. ప్రాథమిక పాఠశాల పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. పూర్వ విద్యార్థులైన అజ్మీర్ శ్రీనివాసరావు, పిడివి ప్రసా ద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపా ధ్యాయులు అజ్మీర్ శ్రీనివాసరావు, పి డి వి ప్రసాద్, దుర్గారావు, డి.శ్రీనివా సరావు, స్వాతి, నాగలక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

### కరాటే పోటీలలో జీసస్ విద్యార్థుల ప్రతిభ




**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మచిలీపట్నం పోలీస్ కల్యాణ మండపంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ – 2026 పోటీలలో మండల పరిధిలోని వీరంకిలాకులో జీసస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పలు వురు విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. కరాటే పోటీలు కాట విభాగంలో పేరుబోయిన షాలేమ్ రాజు ప్రథమ స్థానంలో నిలువగా కందుల లక్ష్మి సునీత, ఇట్ట చంద్రకళ, ఆరేపల్లి హర్ష వర్ధన్, అయ్యా హిమ శంకర్, మాధు యతిన్ లు ద్వితీయ స్థానం, శీలం వెంకటసిరి, పసుమర్తి సుస్మితాంజలి, కోమటి మేఘనాదేశ్వర్‌లు తృతీయ స్థానం సాధించి బహుమ తులు పొందాలని ప్రిన్సిపాల్ గద్దె తారలీల తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన కరాటే టీచర్ వీరంకి వెంకట శివరామకృష్ణలను తారలీలతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# షియాల ధార్మిక గురువును హతమార్చడంపై కొవ్వొత్తులతో నిరసన

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** షియా ల సుప్రీం, ధార్మిక గురువు ఆయతుల్లా అలీఖా మోనాయి మృతి పట్ల మండల పరిధిలోని అలినఖిపాలెం గ్రా మంలో షియా ముస్లింలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో తమ ధార్మిక గురువును హతమార్చడం పట్ల వారు తమ నిరసన వ్యక్తం చేశారు. ఉపాసదీక్షలో ఉన్న ముస్లింలు సాయంత్రం నమాజ్ అనంతరం ఈ నిరసన ర్యాలీ చేపట్టారు. గ్రామంలోని పాత పీర్ల పంజా నుండి కర్బలా మైదానం వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు అమెరికా, ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అంజుమన్ హుస్సేని గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మత గురువు మౌలానా మీర్జా ఇబ్రహం ఆలీ మా ట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ దేశాల సామ్రాజ్య వాద ధోరణి నశించాలని, అంతర్జాతీయంగా అమెరికా సృష్టిస్తున్న మరణ హోమాన్ని ఐక్యరాజా సమితి జోక్యం చేసుకుని అరికట్టాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇరాన్ సుప్రీమ్ లీడర్‌ను హతమార్చడం అన్యాయమని పేర్కొంటూ మానవతావాదులంతా ఈ విషయాన్ని ముక్తకంఠంతో ఖండించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే కృషితో తారు రోడ్డుకు 1.39 కోట్ల నిధులు మంజూరు



**పెనుగంచిప్రోలు, మార్చి 02, మేజర్ న్యూస్ :** ఎన్‌హెచ్65 నుండి ముళ్లపాడు గ్రామం వరకు గతుకులతో తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డును పునర్నిర్మించేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కృషితో మొత్తం ₹1 కోటి నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్65 నుండి ముళ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర ఒక లేయర్ తారు రోడ్డు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముళ్లపాడు నుండి మక్కపేట వరకు 12 కిలోమీటర్ల మేర తారు రోడ్డుకు ప్యాచ్‌వర్క్ పనుల కోసం ₹39 లక్షలు మంజూరు చేయబడగా, ఆ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నుండి ప్రారంభమయ్యే పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే తాతయ్య కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం ద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, రవాణా రంగాలకు ఊతమిచ్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, మాజీ జెడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, టీడీపీ నాయకులు వెల్ది అప్పారావు, ఐలపోగు వెంకటేశ్వర్లు, రోడ్డు సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నవాబుపేటలో పల్లెపండుగ 2.0





**పెనుగంచిప్రోలు, 02, మేజర్ న్యూస్ :** మండలంలో నవాబుపేట గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లె పండుగ 2.0 కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన 5 గోకులం షెడ్డులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులకు స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు దిశగా వేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్లు, నీరు, వెలుగు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పల్లె పండుగ వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, నవాబుపేట గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నంబూరి వెంకటేశ్వరరావు, చెరువు ప్రెసిడెంట్ గింజుపల్లి వెంకటయ్య, సొసైటీ చైర్మన్ చింతా వెంకటేశ్వరరావు (బుల్లి), విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జామా ఆనందరావు, విజయవాడ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నల్లమోలు శివరామకృష్ణ ప్రసాద్ పెనుగంచిప్రోలు గ్రామ మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ బాబు, అయిలపోగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి స్పెల్ బి పోటీలలో విజ్ఞాన్ విజయభేరి....

## జిల్లా స్థాయి ద్వితీయ, తృతీయ కన్సోలేషన్ 11 బహుమతులు




**జగ్గయ్యపేట, 02, మేజర్ న్యూస్ :** మైలవరంలోని ఎస్ ఎస్ కె ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఆదివారం నిర్వహించిన స్పెల్ బి పోటీలలో పట్టణానికి చెందిన విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు రెండవ తరగతికి చెందిన కొండూరు అధిర ప్రజ్ఞ జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి, ఏడవ తరగతి కి చెందిన మోరే హర్షిక జిల్లా స్థాయి తృతీయ బహుమతి సాధించారు. అంతేకాకుండా ఎల్ కె జి యనుగంటి యక్షిత్, ఒకటవ తరగతి కి చెందిన తరిగొప్పుల లక్ష్మి చంద్రిక, మూడవ తరగతికి చెందిన బొల్లెద్దు రాము, ఇంటూరి మంజు ప్రియదర్శిని, ఐదవ తరగతికి చెందిన బొజ్జా లోహిత, బోనగిరి మాధవీలత ఎనిమిదవ తరగతికి చెందిన రంగు హోత్విక నాగ సంజన, తొమ్మిదవ తరగతికి చెందిన కాకనబోయిన పవిత్ర, బొబ్బిలిపాటి వర్షిత్ మొదలగు వారు కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వీరి అభినందన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ తమ స్కూల్ నుంచి హాజరైన 14 మంది విద్యార్థులలో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి గెలుచుకోవటమే కాక కన్సోలేషన్ బహుమతులతో కలిపి మొత్తం 11 మంది విద్యార్థులు బహుమతులు గెలుచుకోవటం తమ స్కూల్ కు ఎంతో గర్వకారణం అని, ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో స్పెల్ బీ పోటీలో మరింత ప్రవీణ్యం పొందుతామని ఆమె తెలిపారు.

# బచ్చుల అర్జునుడు 3వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**గన్నవరం, మార్చి 2, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు 3వ వర్ధంతి సందర్భంగా గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన స్మారక సభలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దొంతు చిన్నా మాట్లాడుతూ... ఆయన రాజకీయ ప్రస్థానాన్ని స్మరించారు. 2014లో కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, 2017లో ఎమ్మెల్సీగా, 2020లో పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధత పార్టీకి ఆదర్శమని తెలిపారు. ప్రతిపక్షంలో పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో గన్నవరం నియోజకవర్గంలో పార్టీకి అండగా నిలిచి, కార్యకర్తలకు ధైర్యం నూరిపోసిన నాయకుడు బచ్చుల అర్జునుడు అని పేర్కొన్నారు. 2020 నుండి 2023 వరకు నియోజకవర్గ ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేశారని కొనియాడారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో, వారికి అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని తెలిపారు. ఆయన ఆశయాలను నెరవేర్చడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, గన్నవరం టౌన్ టీడీపీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, టీడీపీ జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ సుధాకర్, గన్నవరం మండల బీసీ సెల్ అధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర టిఎన్ టియుసి కార్యదర్శి బుస్సే నాగప్రసాద్, నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు చల్లగుళ్ళ సందీప్, గన్నవరం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బుస్సే సరిత, గన్నవరం మండల తెలుగుయువత అధ్యక్షులు నందిపాముల పృథ్వీ, జిల్లా విజిలెన్స్ బోర్డు డైరెక్టర్ తిరువీధి నరేష్, టీడీపీ నాయకులు సొంగా సంతోష్, కంచర్ల సూర్యప్రకాష్, కొండేటి నాగరాజు, నిమ్మకూరి మధు, ఆరిఫ్ పఠాన్, యెల్లా రఘు, చల్లగుళ్ళ సుమంత్, గుత్తా జయేంద్ర, రాహుల్, జయంత్, జయరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సూపరింటెండెంట్ ఇంజనీర్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీసిపిడిసిఎల్ నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.రవీంద్రబాబు విజయవాడ డివిజన్ నుండి పదోన్నత పై కృష్ణా జిల్లాకు నియమించిన రాష్ట్ర ప్రభుత్వం

## వికసిద్భారత్ జి రాంజీ 125 రోజుల ఉపాధి హామీ పేరుతో గోడ పత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఏడాదికి 125 రోజుల పని దినాలు కల్పిస్తూ కొత్తగా వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్..వి.బి. జి రాంజీ పథకాన్ని వచ్చే 2026 27 ఆర్థిక సంవత్సరం నుండి అమలులోకి రానుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని మీకోసం సమావేశ మందిరంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ రూపొందించిన వికసిద్భారత్ జి రాంజీ 125 రోజుల ఉపాధి హామీ పేరుతో గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇది గ్రామీణ అభివృద్ధికి నూతన సంకల్పం, ఉపాధికి కొత్త హామీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ దోమ పిడి శివప్రసాద్ మెప్మా పీడీ సాయిబాబు, సర్వ శిక్ష ఏపి సి కుమిదిని సింగ్, డిఎస్పి శ్రీనివాసరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సైనికుల సంక్షేమం కోసం నిధులు సమకూర్చడం అభినందనీయం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మన దేశ రక్షణకు సరిహద్దుల్లో సైనికులు ఎంతగానో పాటుపడుతున్నారని వారి సంక్షేమం కోసం నిధులు సమకూర్చడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు.సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ మెప్మా పీడీ సాయిబాబు ఆధ్వర్యంలో పతాక దినోత్సవ నిధి కోసం దాతల నుండి సేకరించిన 6.65 లక్షల రూపాయల బ్యాంకు చెక్కును సైనిక సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ హరి కిషోర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, మెప్మా పీడీ సాయిబాబు, సర్వ శిక్ష ఏపీసి కుమిదిని సింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జనసేన ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం ఉపాధ్యక్షుడు పసుపులేటి విజయభాస్కర్, ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో జనసేన ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సభ్యత కార్యక్రమంలో కొత్తగా 240 మంది జనసేన సభ్యత్వం తీసుకున్నట్లు గ్రామ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనేసేన అధ్యక్షుడు మందా యుగంధర్,కొట్టే రాజేష్, చాతరాజుపల్లి పవన్ కుమార్, పార్టీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఇంటి స్థలం ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా...





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రులో అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ హెచ్చరించారు.ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరుతూ సోమవారం పార్టీ నాయకులతో కలసి పామర్రు తహసిల్దారు కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేసారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వెలుపల ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఏ విధమైన అలవికాని, ఆచరణ సాధ్యము కాని మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందో జగమెరిగిన సత్యం అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు కూడా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ, రాష్ట్ర అభివృద్ధి కంటే కూటమి నాయకుల స్వంత అభివృద్ధినే దృష్టిలో ఉంచుకుని పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై, పేద ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తూ వారిని ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కానీ ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజల పక్షాన పోరాడవలసిన భాద్యత ప్రతిపక్షంగా మేమెన్నడు మరుచిపోమన్నారు. నగరాలలో, పట్టణాల్లో జీవనోపాధి నిమిత్తం వెళ్ళి అక్కడే స్థిరపడిన కొన్ని లక్షల పేద కుటుంబాలు ఉండటానికి సొంత గృహాలు లేక వారికి వచ్చే అరకొర ఆదాయాలలో అధికమొత్తం ఇంటి అద్దెలకు కేటాయిస్తూ జీవించడం ఎంతో కష్టతరంగా ఉందన్నారు. అలాగే గ్రామాలలో స్వంత ఇంటి స్థలాలు లేక, ఉండే ఒకే గృహంలో రెండు మూడు కుటుంబాలు కలిసి జీవించడం, కుటుంబాల మధ్య మనుషుల మధ్య అనవసరమైన మనస్పర్ధలకు అపార్ధలకు దారితీసే పరిస్థితులుఇ ఉన్నాయన్నారు. ఈ విధంగా నగరాలు, పట్టణాలు, గ్రామాలలో ఎన్నో సంవత్సరాలనుంచి స్వంత స్థలాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తుత ప్రతిపక్షం నాటి అధికారపక్షమైన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాటి ముఖ్యమంత్రి, తమ పార్టీ అధ్యక్షులు అయిన వై.యస్. జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాదయాత్రలో రాష్ట్రమంతా తిరిగి తెలుసుకున్నారని తెలిపారు. దానిలో భాగంగా ఆనాడు ఎన్నికల హామీలలో అర్హులైన ప్రతి ఒక్కరికి స్వంత ఇంటిస్థలం అని నవరత్నాలులో భాగం చేసారన్నారు. అదే మాట ప్రకారం అధికారం చేపట్టిన తొలినాళ్ళలోనే కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లక్షల పైచిలుకు ఇళ్ళ పట్టాలను లబ్దిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి మరీ ఇచ్చిన ఘనత తమ నాయకుడిదని పేర్కొన్నారు.

నవరత్నాలు – పేదలందరకి ఇళ్ళు పథకంలో భాగంగానే పామర్రు నియోజకవర్గంలో కూడా తన నాయకత్వలో సుమారు 13 వేల లబ్ధిదారులను గుర్తించి వారిలో సుమారుగా 9 వేలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను లబ్దిదారులకు అందించగలిగామన్నారు. అయితే నియోజకవర్గ కేంద్రమైన పామర్రులోను, మరి కొన్ని గ్రామాలలో మాత్రం స్థలం సేకరణ తర్వాత ఎదురైన కొన్ని న్యాయపరమైన ఆటంకాల వలన కొన్నిచోట్ల మాత్రం ఇళ్ళ పట్టాలు ఇవ్వడం సాధ్యపడలేదని తెలిపారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు గత ప్రభుత్వంలో ఇచ్చిన సెంటున్నర స్థలాలని హేళన చేస్తూ మేము అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికి 3 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని ప్రజలని నమ్మించి ఓట్లు వేయించుకుని గెలిచాక కనీసం ఈ రెండు సంవత్సరాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా ఇంటి పట్టా ఇచ్చింది లేదని విమర్శించారు. పైగా 3 సెంట్లు ఇంటిస్థలాలు ఇస్తామని చెప్పి గెలిచిన ప్రస్తుత శాసనసభ్యుడు కొన్ని రోజుల క్రితం అసెంబ్లీలో పామర్రులో కనీసం టిడ్కో గృహాలు ఇప్పించమని అడగడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ఇళ్ళ స్థలాల నిమిత్తం తమ హయాంలో సుమారు 30 ఎకరాల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం కొని దాన్ని లెవెలింగ్ కూడా చేసామన్నారు. అయితే కొంతమంది కావాలని కుట్రపూరితంగా లేవనెత్తిన కొన్ని అంశాలవలన న్యాయపరమైన అవాంతరాలు కలిగి అది నిలిచిపోయిందన్నారు.

కావున వై.యస్.జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన తమ పార్టీ వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ తరపున పేద ప్రజల పక్షాన తామంతా కోరేదేమంటే ఇళ్ళ స్థలాల కోసం ఇప్పటికే కొని సిద్ధంగా ఉంచిన ప్రదేశాన్ని పరిశీలించి, వీలైనంత త్వరలో న్యాయపరమైన ఇబ్బందులు తొలగేలా చేసి, పామర్రు ప్రజల ఎన్నో ఏళ్ళ కలగా మిగిలిపోయిన స్వంత ఇంటి స్థలంను అర్హులైన లబ్దిదారులకు కుల మతాలకు అతీతంగా మరీ ముఖ్యంగా పార్టీలకు అతీతంగా అందించేలా ఏర్పాట్లు చేయమని తహసిల్దార్ ను కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా ఎవరైతే 3 సెంట్లు ఇంటిస్థలం ఇస్తాం అని చెప్పి అధికారంలో కూర్చున్నారో వారిపై కూడా ఒత్తిడి తీసుకొచ్చి చాలీ చాలని టిడ్కో గృహాల పేరుచెప్పి కాలయాపనలు చేస్తూ ప్రజలని మోసం చెయ్యకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో, రాష్ట్రంలో కూడా అర్హులైన లబ్దిదారులందరికి 3 సెంట్ల ఇళ్ళ స్థలాలు వచ్చేలా చూడవలసిన బాధ్యత రెవెన్యూ అధికారుల మీద కూడా ఉన్నదనే విషయాన్ని తెలియ తెలియపరిచినట్లు చెప్పారు. అంతే కాకుండా ఈ విషయంలో వీలైనంత త్వరగా రెవిన్యూ అధికారులు స్పందించి లబ్దిదారులకి ఇళ్ళ పట్టాలు మంజూరు చేయించని యెడల ప్రజల తరుపున ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేలా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అనిల్ కుమార్ హెచ్చరించారు. తొలుత నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శనగా అనిల్ కుమార్ తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నేడు మోపిదేవి, పెదకళ్లేపల్లి దేవస్థానాల మూసివేత



**మోపిదేవి మేజర్ న్యూస్:** చంద్రగ్రహణం నేపథ్యంలో మంగళవారం మోపిదేవిలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, మండల పరిధిలోని పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా నాగేశ్వరస్వామి దేవస్థానాల ఆలయ ద్వారాలు ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం తాత్కాలికంగా మూసివేయనున్నారు. గ్రహణ కాలములో ఎలాంటి దర్శనాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, తిరిగి భక్తులకు దర్శనము కల్పిస్తారు. భక్తులు సహకరించి దేవస్థాన నియమాలను పాటించాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

## ఉచిత హోమియో వైద్య శిబిరంలో హోమియో మందులు పంపిణీ



**చల్లపలి మేజర్ న్యూస్:** స్థానిక చంద్ర రాజేశ్వర రావు వికాస కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 140 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా హోమియో మందులు పంపిణీచేశారు. విజయవాడకు చెందిన హోమియో వైద్యురాలు పావని వైద్య పరీక్షలు నిర్వహించారు. వికాస కేంద్ర ట్రస్టుబోర్డు సభ్యులు అడ్డాడ ప్రసాద్బాబు శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వి.వి.జి.కె.మూర్తి, సిద్దాబత్తుల వాసు, హర్షవర్ధన్, యార్లగడ్డ నాగమల్లేశ్వరి, ఏడుకొండలు, సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.



## ఎస్‌హెచ్‌జి మహిళలకు 12వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం

విజయవాడ మేజర్ న్యూస్ : ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో మష్రూమ్స్ పెంపకం, హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తుల తయారీ విధానం పై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 45 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. 12వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు వెళ్లిన వీరికి మార్చి 2 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఐదు రోజులు పాటు మష్రూమ్స్ పెంపకం, హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తుల తయారీ విధానం పై శిక్షణ వుంటుంది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశం ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్.లో సోమవారం అసోసియేట్ ప్రొఫెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె –హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహ్మద్ ఖాన్, హోమ్ బేస్డ్ ప్రొగ్రామ్స్ ట్రైనర్ మానస, మష్రూమ్స్ పెంపకం ట్రైనర్ ప్రసన్న శిక్షణ తీసుకునే మహిళలకు ఉత్పత్తుల తయారీ విధానం, శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు. హోమ్ బెస్డ్ ప్రొడక్ట్స్ (వాషింగ్ ఫౌడర్, లిక్విడ్ సోప్స్, షాంపులు, పినాయల్) తయారీలో శిక్షణ పొందే వారికి ట్రైనర్ మానస హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ తయారీకు కావాల్సిన ముడి పదార్ధాలు వాటి లక్షణాలు, తయారీ ప్రక్రియ, ఉపయోగాలు సవివరంగా తెలియజేయటం జరిగింది. అలాగే మష్రూమ్స్ పెంపకం ట్రైనర్ ప్రసన్న మష్రూమ్స్ పెంపకానికి సంబంధించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.. స్వయం ప్రతిపాదికన వృద్ధి సాధించేందుకు శిక్షణ కార్యక్రమంకు పంపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి శిక్షణ పొందుతున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో–ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## వితరణశీలికి సత్కారం

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో దక్షిణంవైపు శాశ్వతంగా రేకులు పందిరి తోపాటు విద్యుత్, సీలింగ్ ఫ్యాన్లు సౌకర్యంను 1.30 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన పెడసనగల్లు గ్రామ వాస్తవ్యులు శ్రీకాంత్ (పెదపూడి) దంపతులను సోమవారందేవాలయపాలక మండలి కోశాధికారి జోశ్యుల నాగ జగన్మోహనరావుపట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆ దంపతుల పేర్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షులు కావూరి భానుమూర్తి, ఉపాధ్యక్షులు పసుమర్తి నారాయణ మూర్తి, కార్యదర్శి భాగవతుల బాలకృష్ణ ప్రసాద్, అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# మాదిగల అభ్యున్నతికి తగిన సహకారం అందిస్తాం..





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** మాదిగల అభ్యున్నతికి తగిన సహకారం అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని మాదిగల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వినతి పత్రం రూపంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సమస్యలకు తగిన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గన్నవరం నియోజకవర్గ ఇంచార్జ్ మంద వేణు మాదిగ, కో-ఇంచార్జ్ కొప్పుల కామేశ్వరరావు మాదిగ, ఉంగుటూరు మండలం అధ్యక్షులు పులపాక పాస్కల్ మాదిగ, విజయవాడ రూరల్ మండలం అధ్యక్షులు కొక్కిలిగడ్డ కమల్ రాజు మాదిగ, టీడీపీ గన్నవరం నియోజకవర్గ లీగల్ చైర్మన్ తగరం కిరణ్ బాబు, సూరంపల్లి మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కొమరవల్లి ప్రసాద్, బొకినేల తిరుపతిరావు, కొండ్రు దాసు, వంగూరి,దాసు, నందేటి తిరుపతిరావు, కొమ్ము సుదర్శనం, కోడలి సుమన్, కోట బాబూరావు, పైడిముక్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అవనిగడ్డలో మన శంకర వరప్రసాద్ 50 రోజుల వేడుకలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ చిత్రం 50 రోజులు పూర్తి చేసిన సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సోమవారం స్థానిక వెంకటేశ్వర థియేటర్‌లో మన శంకర వరప్రసాద్ రోజు నాలుగు ఆటలతో 50 రోజులు ప్రదర్శించిన సందర్భంగా థియేటర్ ఆవరణలో కేక్ కట్ చేసి అభిమానులు సంబరాలు చేసుకున్నారు థియేటర్ ఆపరేటర్లకి ఇద్దరికీ బట్టలు పెట్టి. థియేటర్ వద్ద భారీగా మందు గుండు సామాగ్రి పేల్చి వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమం చిరంజీవి సీనియర్ అభిమాని అప్పికట్ల తారక మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మత్తి వెంకటేశ్వరరావు, అన్నపరెడ్డి వెంకటస్వామి, గాజుల శంకర్రావు, బొప్పన భాను, కటికల వసంత, దుడ్డు మురళి, తోట దామోదర్, పరుచూరి సురేష్, సిద్దినేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 70 ఫిర్యాదులు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10.00 నుంచి 13.00 గంటల వరకు ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు డీసీపీ ఎ.బి.టి.ఎస్. ఉదయారాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుండి మొత్తం 70 ఫిర్యాదులు స్వీకరించి, ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల వివరాలు: భూ / ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలు 40, భార్యాభర్తలు, కుటుంబ కలహాలు 11, వివిధ మోసాలు 03, మహిళా సంబంధిత నేరాలు 04, దొంగతనాలు 01, ఇతర వివిధ సమస్యలు 11. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి సహకరించారు.

# నిర్ణిత గడువులో సంతృప్తికరమైన పరిష్కారాలను అందిస్తున్నాం..

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదులకు నిర్ణిత గడువులో సంతృప్తికరమైన పరిష్కారాలను అందిస్తున్నాం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించారు. జోనల్ కార్యాలయాల్లో జరుగుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి స్వీకరించి ఫిర్యాదులకు అధికారులు అందరూ నిర్ణీత గడువులో సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందించేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రధాన కార్యాలయంలో వీల్ చైర్లు తక్షణమే ఏర్పాటు చేయాలని, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించగా, వెంటనే వెహికల్ డిపో నుండి రెండు వీల్ చైర్లు ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచారు, అధికారులు వారితో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఒకవైపు ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా మరోవైపు అధికారులతో సమీక్షించారు. నిరంతరం దోమల నిర్మూలన చర్యలు చేపడుతూనే ఉండాలని, ప్రతిరోజు త్రాగునీటి పరీక్షలు చేస్తుండాలని, ప్రణాళిక బద్ధంగా వాటర్ ట్యాంకులను కడుగుతుండాలని, పన్ను వసూళ్లు సమర్ధవంతంగా చేయాలని అధికారులందరూ తమ తమ సిబ్బంది మీ పర్యవేక్షిస్తూ నగరాభివృద్ధిలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని కమిషనర్ అన్నారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 22 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 6, ఇంజనీరింగ్ 7, రెవిన్యూ 6, పి ఒ యుసిడి 1, హౌసింగ్ 1, హార్టికల్చర్ 1 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, సూపర్డెంట్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఆర్ ఎఫ్ ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాల్ కృష్ణ, ప్రభాకర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

## కళ్యాణమండప నిర్మాణానికి రూ.13.5లక్షల విరాళం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివి సీమ కొంగుబంగారమై, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజుల్లుతున్న గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎవర్ గ్రీన్ గ్రూప్స్ ప్రాజెక్ట్ విన్ రైజ్ (రియల్ ఎస్టేట్)అధినేత మండలి రామకృష్ణ 13 లక్షల 50 వేల రూపాయలను చెక్కు రూపంలో విరాళం గా అందజేశారు. సోమవారం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామిని కలిసిన ఆయన మిత్రుడు మండలి రామకృష్ణ ఆలయ ఆవరణ ఆనుకుని ఉన్న స్థలంలో కళ్యాణ మండపం నిర్మాణ నిమిత్తం స్థల కొనుగోలు 27 లక్షలు అవసరం కాగా 13 లక్షల 50 వేలను విరాళంగా అంద చేశారు గత సంవత్సరం డిసెంబర్ 11న చైర్మన్గా బాధ్యతలు తీసుకొన్న మొదలు ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న చైర్మన్ కు పాలకవర్గ సభ్యులకు రామకృష్ణ అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా రామకృష్ణ ను వెంకటస్వామి ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసు (వాసు) లు శాలువాతో సత్కరించి, ఆశీర్వదించారు. రామకృష్ణ చేసే ప్రతి పనికి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మండల ధర్మచార్యులు అన్నపరెడ్డి కృష్ణ పాలకవర్గ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వయోగి విశ్వంజీ ఆశీస్సులందుకున్న ఎమ్మెల్యే మండలి దంపతులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విశ్వయోగి విశ్వంజీ కలిసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు ఆశీస్సులు అందుకున్నారు. సోమవారం గుంటూరు జిల్లా చినకొండ్రుపాడులో విశ్వనగర్లోని విశ్వగురు పీఠంలో ఆయనను మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ నెల 4-5 తేదీల్లో విశ్వంజీ పుట్టినరోజు సందర్భంగా వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విశ్వంజీ తమ పుట్టినరోజు వేడుకలను విశ్వశాంతి సమైక్యతా దినోత్సవ వేడుకలుగా నిర్వహించ తలపెట్టగా, 4వ తేదీ సాయంత్రం విశ్వగురు పీఠంలో జరిగే సభకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సభాధ్యక్షులుగా విచ్చేయనున్నారు.

## కోడూరులో 4న అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరులో శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి వారి దేవాలయం వద్ద బుధవారం స్వామివారి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ సోమవారం తెలిపారు బుధవారం ఉదయం గణపతి అయ్యప్ప మాలిక పురాతమ్మ అవాహిత దేవతలకు హోమాలు చేస్తామన్నారు అయ్యప్ప మూలమూర్తికి పంచామృతాభిషేకం భక్తులచే స్వామివారికి క్షీరాభిషేకం అన్న సమర్పణ నిర్వహిస్తామన్నారు.

## మార్చి 4న పెనుగంచిప్రోలుకి మంద కృష్ణ మాదిగ రాక



**జగ్గయ్యపేట, మార్చి 2, మేజర్ న్యూస్ :** పట్టణంలోని కాకాని నగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక పెద్దలతో కలిసి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మాదిగ కులస్తుల తొలి బోనాల జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కొన్ని దశాబ్దాలుగా అమ్మవారికి తొలి బోనం చింతయ్య మాదిగ వారసత్వాన మాదిగలే సమర్పించడం జరుగుతుందని కావున ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి మార్చి4న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తారు అని తెలియజేస్తూ ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి దావీదు మాదిగ, ఎమ్మార్పీఎస్ జగ్గయ్యపేట నియోజకవర్గం ఇంచార్జ్ చింతిరాల గోపి మాదిగ, జగ్గయ్యపేట మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అమ్మనబోయిన రారాజు మాదిగ, నెమ్మది సమియేలు మాదిగ, వల్లపుదాసు తిరుపతిరావు మాదిగ, అన్నెపాక సీమోను మాదిగ, వేమవరపు ఆర్లయ్య మాదిగ, కటికల శ్యామ్ లక్ మాదిగ, అద్దంకి దశరథి రావు మాదిగ,అన్నపాక దుర్గా మహేశ్వరరావు మాదిగ, కోట ప్రభుజి మాదిగ, పొద్దుటూరి రాజశేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాలలో శంకుస్థాపనలు

## పలురోడ్లను ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే రాజా





**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం సుడిగాలి పర్యటన జరిపి దాదాపు మూడు కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తిచేసిన పలురోడ్లను ప్రారంభించారు. మండల పరిధిలోని జుజ్జవరం గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు 20 లక్షల రూపాయల అంచనాలతో నిర్మించిన సిసి రోడ్డును కుమార్ రాజా ప్రారంభించారు. అదే గ్రామంలో 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాపవరం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు 14.70 లక్షల రూపాయల అంచనాలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అలాగే మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి నుండి కాపవరం మీదుగా జెపి రోడ్డు వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న తారు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పసుమర్రు గ్రామంలో పలు సిసి రోడ్లను ప్రారంభించారు. గంగులచెరువు గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి తమకూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దీనిలో భాగంగానే వివిధ పద్దుల కింద నిధులను సమకూర్చి రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల నుండి ప్రధాన రహదారులకు రహదారి సౌకర్యం ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలలో రహదారి సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యపరంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామీణ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 10.60 కోట్ల రూపాయల వ్యయంతో 29 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. సచివాలయాల పరిధిలో ఈ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తూ స్థానికంగా వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, మాజీ ఎంపిపి గొట్టిపాటి లక్ష్మీ దాసు, మచిలీపట్నం పార్లమెంటు పార్టీ ఉపాధ్యక్షులు మండపాక శంకర్ బాబు, ఎండిఓ కె.జ్యోతి, తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అవసరమైన నాలుగు సెంట్లు స్థలాన్ని ఉచితంగా విరాళంగా అందించిన కూర్చేటి నాంచారయ్య దంపతులను ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించి వారిని సత్కరించారు.

# ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా మీడియా కీలక పాత్ర





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజలకు ప్రభుత్వా నికి వారధిలా ఉంటూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేరవేస్తూ ప్రసారమాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో 2026 - 27 సంవత్సరానికి నూతనంగా మంజూరైన మీడియా అక్రిడిటేషన్ కార్డులను మీడి యా ప్రతినిధులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం చేపడుతున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకా లను కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో వారికి అవగాహన కలిగించ డంలో ఎంతగానో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రసారమాధ్యమాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్లు మంజూరు చేశామని ఇంకా ఎవరైనా సరే మిగిలి ఉంటే వారికి సంబంధించిన ఆధార పత్రాలు, అనుబంధ పత్రాలు జతపరిచి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి యమ్. వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# విస్తృతంగా పల్లె పండుగ అభివృద్ధి పనులు

## వెంకటాపురం, కొక్కిలిగడ్డ రోడ్ల నిర్మాణం ప్రారంభం



**మోపిదేవి మేజర్ న్యూస్:** పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మండలంలో విస్తృతంగా రహదారుల నిర్మాణం మొదలైంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా విడుదల చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.44 కోట్లతో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో ఆరు రోడ్లను మంజూరు చేశారు. తద్వారా రూ.97లక్షలతో మండల పరిధిలోని మోపిదేవి - వెంకటాపురం మధ్య 2.3కిలోమీటర్ల ప్రధాన రహదారి నిర్మాణ పనులను సోమవారం చేపట్టారు. జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు పూజలు చేసి పనులను ప్రారంభించారు. మండల పరిధిలోని ఎన్.హెచ్-216 నుంచి కొక్కిలిగడ్డ వరకు 1.15 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎన్ఆర్ఆజీఎస్ నిధులు రూ.49 లక్షలతో చేపట్టిన పనులను గ్రామ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి పూజలు చేసి ప్రారంభించారు.

ఈ రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు కేటాయించిన జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు పనులను పరిశీలించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, మాజీ సర్పంచ్ కేసాని శివుడు, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, పంచాయతీ కార్యదర్శి చందన దేవి నాగరాజ వతి, సనకా వెంకట రాజేష్, కంచర్ల శ్రీను, కేసాని శ్రీను పాల్గొన్నారు.



## మహా కుంభాభిషేక మహోత్సవము-2026కు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఆహ్వానం

### ఆహ్వాన పత్రిక అందించిన దుర్గగుడి ఈవో శీనా నాయక్, ఆలయ చైర్మన్ బొర్రా రాధకృష్ణ (గాంధీ)

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మార్చి ఆరో తేదీ నుంచి ప్రారంభమయ్యే మహా కుంభాభిషేక మహోత్సవము-2026 కు విచ్చేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌ను ఆలయ చైర్మన్ బొర్రా రాధకృష్ణ (గాంధీ), ఆలయ ఈవో శీనా నాయక్, కలిసి ఆహ్వానించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఎంపి కేశినేని శివనాథ్‌కు ఆలయ చైర్మన్ బొర్రా రాధకృష్ణ (గాంధీ), ఆలయ ఈవో శీనా నాయక్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ ఆహ్వానపత్రిక అందించారు. మార్చి 6వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు మహా కుంభాభిషేక మహోత్సవము జరుగుతుందని వివరించారు. వేద పండితులు ఎంపి కేశినేని శివనాథ్ కి వేద ఆశీర్వచనం చేయటంతో పాటు అమ్మవారి తీర్ధ ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. ఆ తర్వాత కుంభాభిషేక మహోత్సవము-2026 ఏర్పాట్ల గురించి ఎంపి కేశినేని శివనాథ్ అడిగి తెలుసుకున్నారు. 12 ఏళ్లకు ఒకసారి దేవస్థానంలో జరిగే మహా కుంభాభిషేక మహోత్సవము ప్రతిష్టాత్మకంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఎంపి కేశినేని శివనాథ్ సూచించారు.

## ప్రగతి నారీ శక్తి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలుగా దారెల్లి శారమ్మ బాధ్యతలు





**వత్సవాయి మేజర్ న్యూస్:** మండలంలోని పోలంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ప్రగతి నారీ శక్తి వ్యవస్థాపక అధ్యక్షురాలు పొట్లూరి దేవి ఎన్ పి జె ఎఫ్ చైర్మన్ విజిఆర్ నారగాని నూతక్కి కృష్ణవేణి, నూతక్కి కృష్ణ వేణి కోట సమాధానం ఉమాలక్ష్మి బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ అంగడాల పూర్ణచందర్రావు, చైతన్య సంఘాల సమితి చైర్మన్ జయచంద్ర ఎన్ఎఫ్సి చైర్మన్ జయ బాబు వత్సవాయి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కాటేపల్లి రామలక్ష్మి పోలంపల్లి గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ వంకాయలపాటి ఈశ్వరమ్మ, బోనకల్లు బ్రాంచ్ కెనాల్ చైర్మన్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు అనంతరం జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పోలంపల్లి గ్రామంలో ప్రగతి నారీ శక్తి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు దారెల్లి షారమ్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడి, ఆశా వర్కర్లు మిడ్ డే మీల్స్ తదితర సంస్థలలో పనిచేసే మహిళలకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళలు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999